జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 18 | జులై | 2026 ◆ పేజీలు : 5

## గ్రంథాలయానికి రూ.10 లక్షల ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన



**కొత్తగూడెం టౌన్ జూలై 17 ( ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం 28వ డివిజన్‌లోని ప్రభుత్వ గ్రంథాలయానికి భద్రత కల్పించేందుకు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ పనులకు ఎంపీ గారపాటి రేణుకా చౌదరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ చౌహాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

మిగతా 2 లో...





## టేకులపల్లిలో నూతన గ్రంథాలయ భవనానికి ఘనంగా శంకుస్థాపన

- విద్యార్థులు, యువతకు విజ్ఞాన కేంద్రంగా గ్రంథాలయం నిలవాలి
- ఆధునిక సౌకర్యాలతో భవన నిర్మాణం చేపడతాం: రేణుకా చౌదరి
- విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టేకులపల్లి, జూలై 17,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో పి. రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మాట్లాడుతూ, గ్రంథాలయాలు సమాజ విజ్ఞానానికి, విద్యార్థుల మేధో వికాసానికి బలమైన పునాదులని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా చదువుకునే వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధునిక గ్రంథాలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పుస్తక పఠన అలవాటును పెంపొందించడం ద్వారా యువతలో ఆలోచనా శక్తి, పోటీ పరీక్షల సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, టేకులపల్లిలో నిర్మించనున్న నూతన గ్రంథాలయం విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులకు ఎంతో ఉపయోగపడే విజ్ఞాన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు మెరుగైన విద్యావసతులు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఐటీడీఏ పీవో పి. రాహుల్ మాట్లాడుతూ

మిగతా 2 లో...

## ప్రైవేట్ స్కూల్, కళాశాలల బస్సులపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక నిఘా

- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు బస్సు డ్రైవర్లు పట్టివేత
- స్కూల్, కళాశాలల యాజమాన్యాలకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక




**కొత్తగూడెం టౌన్, జూలై 17 (ప్రజాజ్యోతి)** కొత్తగూడెం పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి బస్సులు నడుపుతున్న ఇద్దరు ప్రైవేట్ కళాశాలల బస్సు డ్రైవర్లను గుర్తించి కేసులు నమోదు చేశారు. త్రీ టౌన్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల (పాల్వంచ)కు చెందిన బస్సు డ్రైవర్ సనప భాస్కర్, ఎస్ఆర్‌డీజీ పాఠశాల (కొత్తగూడెం)కు చెందిన బస్సు డ్రైవర్ మేడి అజయ్ మద్యం సేవించి బస్సులు నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై మోటార్ వెహికల్స్ చట్టంలోని సెక్షన్ 185 కింద

మిగతా 2 లో...

## పోక్సో కేసులో ఆరో నిందితుడు అరెస్టు



- బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మైనర్ బాలికకు ఆశ్రయం కల్పించినట్లు ఆరోపణ

2 లో...

## తాలిపేరు నుంచి సాగునీటి విడుదల

- గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు



**చర్ల, జూలై 17:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాల ఆయకట్టుకు శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు తాలిపేరు ప్రాజెక్టు వద్దకు చేరుకుని కుడి, ఎడమ ప్రధాన కాలువల గేట్లను ఎత్తి అధికారికంగా సాగునీటిని విడుదల చేశారు. దీంతో రెండు మండలాల పరిధిలోని వేలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నారు వేయడానికి, వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు తాలిపేరు ప్రాజెక్టు నుంచి ముందస్తుగా సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. వ్యవసాయమే ఈ ప్రాంత ప్రజల ప్రధాన జీవనాధారమని, రైతులకు సకాలంలో సాగునీరు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.తాలిపేరు ప్రాజెక్టు ద్వారా విడుదలైన నీటిని రైతులు సద్వినియోగం చేసుకుని వరి, ఇతర పంటలను విజయవంతంగా సాగు చేసుకోవాలని సూచించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులకు తాలిపేరు ప్రాజెక్టు ప్రధాన ఆధారంగా నిలుస్తోందని స్థానిక రైతులు ఈ ప్రాజెక్టును వరప్రసాదంగా భావిస్తారని అన్నారు. ఒకసారి ప్రాజెక్టు పూర్తి

మిగతా 2 లో...

## పోక్సో కేసులో ఆరో నిందితుడు అరెస్టు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి | జూలై 17, ప్రజాజ్యోతి** కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఆరో నిందితుడు, బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ శుక్రవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితులు మైనర్ బాలికను కొత్తగూడెం పాత డిపో ప్రాంతంలోని ఒక గదికి తీసుకెళ్లిన సమయంలో, ఆ గదిలో ఆశ్రయం కల్పించిన వ్యక్తిగా వెంకటేష్‌పై ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు ఆయనను కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి తల్లి జూలై 11న కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే పలువురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, తాజాగా ఆరో నిందితుడు వెంకటేష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుతో కేసులో నమోదైన ప్రధాన నిందితులపై దర్యాప్తు మరింత ముందుకు సాగనుంది. పరారీలో ఉన్న మరో నిందితుడు జాలే నవీన్ కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## తాలిపేరు నుంచి సాగునీటి విడుదల



(మొదటి పేజీ తరువాయి... )

స్థాయిలో నిండితే ఒక పంటకు అవసరమైన సాగునీటి కొరత ఉండదని తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలతో వాగులు, వంకల ద్వారా నిరంతరం నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుందని nదీంతో ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా కొనసాగుతుందని చెప్పారు. వరదల సమయంలో అదనపు నీటిని అధికారులు గేట్లు ఎత్తి గోదావరి నదిలోకి విడుదల చేస్తారని అన్నారు . .సాగునీటి విడుదలతో చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలోని వేలాది ఎకరాలకు నీరు అందనున్న నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఇందల బుచ్చిబాబు, ఇందల రమేష్, బ్రహ్మానంద రెడ్డి, లంక రాజు, సీతాపతి రాజు, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లిలో నూతన గ్రంథాలయ భవనానికి ఘనంగా శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి... )



ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. డిజిటల్ వనరులు, పోటీ పరీక్షల పుస్తకాలు, సూచిక గ్రంథాలు అందుబాటులో ఉంటే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. యువత ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ, గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, పుస్తక ప్రియులు, పరిశోధకులకు అవసరమైన అన్ని రకాల గ్రంథాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. టేకులపల్లి గ్రంథాలయం జిల్లాలో ఆదర్శ గ్రంథాలయంగా నిలిచేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్. వీరభద్రం, ఎంపీడీఓ శ్రీదేవి, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు, ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, టేకులపల్లి సర్పంచ్ బోడబాలునాయక్, కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్‌చంద్రబోస్, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజనుల పై విచక్షణ రహితంగా దాడి చేసిన ఫారెస్ట్ అధికారులు





**గాయాలు పాలైన గిరిజనులు ఆస్పత్రికి తరలింపు**

**భద్రాద్రి జిల్లా జూలై 17, ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలంలోని మనుబోతుల గూడెం, గ్రామపంచాయతీ వేములూరు గ్రామాలలో ఎన్నో సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటున్నా గిరిజనులు అక్కడనే స్థిరనివాసం ఉంటూ బోడు భూములపై ఆధారపడి, వ్యవసాయం సాగు చేసుకుంటున్నారు. శుక్రవారం గిరిజనులు వ్యవసాయ భూముల్లో పత్తి గింజలు వేసుకుంటుండగా ఫారెస్ట్ అధికారులు, మనుబోతులగూడెం వేములూరు గ్రామాలకు వెళ్లి అక్కడ సాగు చేసుకుంటున్నా గిరిజన రైతులపై మహిళలను విచక్షణ రహితంగా కొట్టి గిరిజన మహిళలపై దురుసుగా ప్రవర్తించి ఫారెస్ట్ అధికారులు కనీసం మహిళలని గౌరవం ఇవ్వకుండా వారిపై దాడి చేశారు. ఓ ఫారెస్ట్ అధికారి ఒక మహిళలను కొట్టి ఆమెను కిందపడేసినాడు గిరిజన మహిళ మోకాలు చిప్ప తొలగిపోయింది. అక్కడున్న మహిళలు యువకులు గాయాలు పాలైన మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. గిరిజన రైతులపై మహిళలపై చెలరేగిపోయిన ఫారెస్ట్ అధికారులు, పోడు సాగు చేసుకుంటున్న భూములను, ఫారెస్ట్ అధికారులు జెసిబి యంత్రాలతో కందకాలు తొవ్వుతున్నారని గిరిజనులు జెసిబి యంత్రాలను, ఆపడానికి వెళ్లగా కందకాలు తవ్వుతున్న ప్రదేశంలో ఫారెస్ట్ అధికారులు వారి వాహనంలో సుమారు 20 మందితో వెళ్లి గిరిజనులు సాగు చేసుకుంటున్న, భూములను, లాక్కొని భూములలో పత్తి గింజలు వేసినటువంటి, భూములలో ట్రాక్టర్ల ద్వారా ఫారెస్ట్ అధికారులు దున్నించి, వేసిన పత్తి గింజలు తొలగించి, గిరిజన రైతులను తీవ్ర ఇబ్బందులకు ఫారెస్ట్ అధికారులు గురిచేసినారని మను బోతుల గూడెంలోని, గ్రామ ప్రజలు ఆవేదన చెందారు.



## ఈసీ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీపీ పి.వి.డి. లక్ష్మికి ఘనంగా సన్మానం



**కొత్తగూడెం టౌన్, జూలై 17 ( ప్రజాజ్యోతి )** ఖమ్మం ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ అయిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి ని ఈసీ బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈసీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ ముధులకర్, ప్రధాన కార్యదర్శి గడిపల్లి మహేష్, సంయుక్త కార్యదర్శి గడదాసు నాగరాజు, క్రీడా కార్యదర్శి బానోత్ దేవదాస్, సీనియర్ న్యాయవాది రవిలాల రామారావు తదితరులు మాట్లాడుతూ... పి.వి.డి. లక్ష్మి విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో పనిచేసి న్యాయవాదుల అభిమానం సంపాదించారని కొనియాడారు. ఖమ్మం ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానంలో కూడా ఆమె విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి రూ.10 లక్షల ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి... )

పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులకు విజ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రహరీ గోడ నిర్మాణంతో గ్రంథాలయ ఆవరణ భద్రత మెరుగుపడి, అనధికార ప్రవేశాలు, పశువుల సంచారం, చెత్త పారవేత వంటి సమస్యలకు అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. దీంతో గ్రంథాలయ ఆస్తులు, పుస్తకాలు రక్షించబడటంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రంథాలయ కార్యదర్శి కే. కరణకుమారి, సిబ్బంది లలిత కుమారి, మృదుల, నవీన్, వంశీ, జానీ, ఈశ్వరి, వినోద్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్, కళాశాల బస్సులపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక నిఘా







(మొదటి పేజీ తరువాయి... )

కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వెంటనే సంబంధిత కళాశాల యాజమాన్యాలకు సమాచారం ఇచ్చి, ప్రత్యామ్నాయ డ్రైవర్ల ద్వారా విద్యార్థులను సురక్షితంగా తరలించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు బస్సు డ్రైవర్లకు తప్పనిసరిగా బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించిన తర్వాతే విధులకు అనుమతించాలని సూచించారు. భవిష్యత్తులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు మళ్లీ పట్టుబడితే సంబంధిత యాజమాన్యాలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు

- **భూమి హక్కుల కోసం పోరాడిన చరిత్ర సీపీఎందే- మచ్చ వెంకటేశ్వర్లు**






**చర్ల, జూలై 17:(ప్రజా జ్యోతి ):**భద్రాచలం నియోజకవర్గంలో ఆదివాసులు, నిరుపేదలకు సాగు భూములు, ఇండ్ల స్థలాలు అందించేందుకు పోరాడిన చరిత్ర సీపీఎం పార్టీదేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చర్ల మండలం లోని విజయకాలనీలో నిర్వహించిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమం ప్రారంభంలో సీపీఎం సీనియర్ నాయకుడు కూసుమంచి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. నంతరం "సీపీఎం పార్టీ విశిష్టత" అంశంపై మచ్చ వెంకటేశ్వర్లు, "పార్టీ నిర్మాణం" అంశంపై జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు దోపిడీకి వ్యతిరేకంగా, భూమి హక్కుల కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్మిక, కర్షక వర్గాల ఐక్యతతో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని కొత్త కార్మిక చట్టాల వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని విమర్శించారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచి వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి మచ్చ రామారావు, సీనియర్ నాయకుడు ఊకే రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు పొడుపుగంటి సమ్మక్క, బందెల చంటి, బి. నవీన్, దొడ్డి హరినాగవర్మ, వరదల వరలక్ష్మి, షారోని, శ్యామల చంద్రం, వెంకటేశ్వర్లు, సూరిబాబు, స్పందన, ఆదిలక్ష్మి, నల్లగట్ల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల బూసరాయిలో తహసీల్దార్ ఉమారాణి పర్యటన

- **రెవెన్యూ సేవలపై అవగాహన, ప్రజల సమస్యల పరిష్కారానికి హామీ**

**ఆళ్లపల్లి,జూలై17(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి మండల తహసీల్దార్ గడ్డం ఉమారాణి శుక్రవారం మారుమూల ఏజెన్సీ గ్రామమైన బూసరాయిను సందర్శించి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డులు, కుల, ఆదాయం, ఆధార్ తదితర రెవెన్యూ సంబంధిత సర్టిఫికెట్లపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన పత్రాలు లేని వారు ముందుగా ఆళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నివాస, జనన తేదీ. ధ్రువపత్రాలు పొందాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆగస్టు 5 తర్వాత కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకుంటే అర్హత మేరకు అన్ని రెవెన్యూ సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. అలాగే ఓటరు జాబితాలో పేరు లేని వారికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.వర్షం కురిసే పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రత్యేక చొరవతో పెద్ద వెంకటాపురం వరకు కారులో, అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై బూసరాయికి చేరుకున్న తహసీల్దార్ గ్రామ ప్రజలు, చిన్నారులకు బిస్కెట్లు, తినుబండారాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద వెంకటాపురం సర్పంచ్ వజ్జ ఉమా, ఉపసర్పంచ్ కొమరం రాజేష్, గ్రామ కార్యదర్శి, పెద్ద వెంకటాపురం, సింగారం అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## సారపాకలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు, SIR కార్యక్రమంపై కీలక సమావేశం

- **ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా కృషి చేయాలి**
- **మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్**




**బూర్గంపహాడ్ జూలై 17 (ప్రజా జ్యోతి):** తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు మరియు SIR ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ శ్రీ దిండిగల రాజేందర్ ఆధ్వర్యంలో సారపాక టౌన్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరే వెన్నుముక అని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా ఓటర్ జాబితా సవరణను అత్యంత బాధ్యతతో చేపట్టాలని అన్నారు. సర్ ప్రోగ్రాం ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి ఒక్క ఓటరు ఎన్యూమరేషన్ ఫామ్ ఆన్లైన్ అయ్యే విధంగా కృషి చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు సర్ ప్రక్రియపై అవగాహన పెంచుకొని తమ కుటుంబ సభ్యుల ఎన్యుమరేషన్ ఫామ్ లో కేంద్ర ఎన్నికల సంఘం అడిగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సారపాక పట్టణ అధ్యక్షులు కోనగంచి శ్రీను, పినపాక నియోజకవర్గ యువజన అధ్యక్షులు చల్లకోటి పూర్ణ, చైతన్య రెడ్డి, భూక్య శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే వెంకట్రావు

**చర్ల, జూలై 18: (ప్రజా జ్యోతి ):** భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు చర్ల మండల పర్యటనలో భాగంగా శుక్రవారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలను పరిశీలించి సమీక్ష నిర్వహించారు.అనంతరం విద్యార్థినులతో ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినులకు సూచించారు.పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం, అన్ని ప్రాథమిక సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్







నాయుడు, సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, లంక రాజు, సీతాపతిరాజు, సంబంధిత అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రూ.5లక్షల ఎల్ఓసీ అందజేత



**బూర్గంపహాడ్,జూలై17 (ప్రజా జ్యోతి):**బూర్గంపహాడ్ మండలం పినపాక పట్టి నగర్ గ్రామానికి చెందిన కొట్టే గిరిజకు వైద్య చికిత్స నిమిత్తం రూ.5లక్షల ఎల్ఓసీ ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం సహాయనిధి, ఎల్ఓసీ వంటి పథకాల ద్వారా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మణుగూరు మండల అధ్యక్షులు పిరినాకి నవీన్,యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాభావానికి తగ్గట్టే సాగు చేయండి

- **రైతులకు ఏవో లావణ్య సూచనలు**



**చర్ల, జూలై 17:(ప్రజా జ్యోతి ):**ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని చర్ల మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు.శుక్రవారం సుబ్బంపేట గ్రామంలో రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షా భావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే పెసర, మినుము, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అందించే సూచనలు పాటించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సుబ్బంపేట గ్రామ సర్పంచ్ కాక సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారి అఫ్రిద్, పంచాయతీ కార్యదర్శి సర్వేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## కందిపాడులో వైద్య శిబిరం

**చర్ల, జూలై 17:(ప్రజా జ్యోతి ):**చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని మలేరియా ప్రభావిత మారుమూల గ్రామమైన కందిపాడులో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య సేవలు అందించడంతో పాటు ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం, జ్వరాల సర్వే (ఫీవర్ సర్వే) చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమలు పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అనంతరం ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి నిల్వ నీటిని తొలగించడంతో పాటు ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, స్వరూప, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాళ్లపురం చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



**చర్ల, జూలై 17:(ప్రజా జ్యోతి ):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ హారిక శుక్రవారం చర్ల మండలంలోని రాళ్లపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.గత వారం రోజులుగా స్కిన్ అలర్జీతో బాధపడుతున్న చిన్నారులను ప్రత్యేకంగా డాక్టర్ హారిక పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వారంతో పోలిస్తే ప్రస్తుతం చిన్నారుల్లో స్కిన్ అలర్జీ గణనీయంగా తగ్గిందని వారంతా త్వరగా కోలుకుంటున్నారని తెలిపారు. మరో రెండు నుంచి మూడు రోజుల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే స్కిన్ అలర్జీ పూర్తిగా తగ్గిపోతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్యక్రమాలు డ్రైనేజీ ఏర్పాటుకు గ్రామస్తులు సహకారం

- **అవసర సర్పంచ్ స్వప్న**



**పినపాక,జూలై 17(ప్రజాజ్యోతి )** ప్రధాన రహదారి వెంబడి వర్షం నీరు నిలిచి ఉండడంతో ప్రజల ఇబ్బందులు గమనించిన భూపాలపట్నం సర్పంచ్ స్వప్న తక్షణమే స్పందించారు. శుక్రవారం పినపాక మండల పరిధిలోని భూపాలపట్నం ప్రధాన రహదారిపై నీరు నిలిచి ఉండడం గమనించి వెంటనే ఆ ప్రాంతంలో గ్రావెల్ మొరుము పోయించారు. అలాగే రోడ్డుకిరువైపులా డ్రైనేజీ తీయాలంటే కచ్చితంగా గ్రామస్తుల సహకారం కావాలన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం, ఉప సర్పంచ్ శిరీష, పాల్గొన్నారు.

## ఎల్-నినో ప్రభావాలపై రైతులకు అవగాహన సదస్సు



**పినపాక,జూలై 17(ప్రజాజ్యోతి )** పినపాక మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్ –నినో ప్రభావాలపై రైతులకు మణుగూరు డివిజన్ ఏడీఏ తాతారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాతావరణ మార్పులు, తక్కువ వర్షపాతం కారణంగా వ్యవసాయంలో ఎదురయ్యే సవాళ్లను అధికారులు రైతులకు వివరించారు. ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, వేరుశనగ, బొబ్బర్లు, నువ్వులు, జొన్నతో పాటు వివిధ రకాల కూరగాయల సాగును చేపట్టాలని సూచించారు. పంటల మార్పిడి విధానాలను అనుసరించడం ద్వారా దిగుబడులు మెరుగుపడటంతో పాటు నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులపై అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత, అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణ అధికారి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# మట్టి దందాపై ఉన్నతాధికారులు స్పందించాలి

**ఇల్లందు, జులై 17, (ప్రజా జ్యోతి)** ఇల్లందు – సింగరేణి మండలాల సరిహద్దుల్లో జరుగుతున్న మట్టి దందా విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మా ప్రాంతం మీదుగా నడుస్తున్న మట్టి లారీలను నిలిపివేసే విధంగా చూడాలని మండలంలోని సిఎస్పి బస్తి పంచాయితీ రాజీవ్ నగర్ గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా మా ప్రాంతం మీదుగా ఫ్రెండ్స్ ట్రాన్స్పోర్టేషన్ సంబంధించిన యజమాని తన లారీలు, ట్రాక్టర్ల సహకారంతో 24 గంటలు పగలు రాత్రి తేడా లేకుండా కారేపల్లి మండలం పొలంపల్లి పంచాయతీ నాగయ్య గుంపులోని గుట్ట మట్టిని త్రవ్వుకొని మా గ్రామం మీదుగా తీసుకువెళ్తున్నారన్నారు. రహదారులకు ఇరువైపులా మేము నివసించే ఇండ్లు ఉన్నాయని, రోడ్డుకు అవతల వైపున అంగన్వాడి కేంద్రం సైతం ఉందని ఈ కేంద్రానికి పిల్లలు వెళ్లే క్రమంలో



భయం భయంగా దాటాల్సి వస్తుందని, పెద్దలు సైతం భయంగా రోడ్డు దాటే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం లారీలు ట్రాక్టర్లు నడవడం మూలాన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలుమార్లు సంబంధిత ట్రాన్స్పోర్ట్ యజమానికి విన్నవించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ విషయంపై సింగరేణి తహాసిల్దార్, ఖమ్మం ఆర్డిఓ, ఖమ్మం మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ మట్టి రవాణా ఆగటం లేదని ఆరోపించారు. ఈ మట్టి వ్యాపారులు మాకు అన్ని అనుమతులు ఉన్నాయని, తాము ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాలు, చర్చిలకు మట్టి తోలకం చేస్తున్నామని, వారికి అనుకూలంగా ఉన్న ప్రజాప్రతినిధులతో చెప్పించుకుని తిరిగి మళ్లీ మట్టి దందా కొనసాగిస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి వారు చెప్పిన వాటికి కాకుండా కారేపల్లి సరిహద్దుల నుండి ఇల్లందు సరిహద్దులు దాటి పట్టణం ఇతర గ్రామాలకు మండలాలలు మట్టి తోలకాలు కొనసాగిస్తున్నారని, లారీ టిప్పర్ రూ. 3 వేలు, ట్రాక్టర్ రూ. 8 వందలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. మట్టి దందా విషయంతో మాకు కానీ ఇక్కడ ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం లేదని కేవలం మా ప్రాంతం మీదుగా ఈ తోలకాలు జరుగుతున్న క్రమంలో మేము తీవ్ర అనారోగ్యానికి గురికావడం జరుగుతుందని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇంట్లో ఉండే పరిస్థితి లేదని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం ఈ ప్రాంతం మీదుగా మట్టి తోలకాల కోసం తీసుకువెళ్లే జెసిబి తగిలి ఓ వ్యక్తి మోకాలుకు గాయమైందని, ఆయనప్పటికీ వారిలో ఎలాంటి చలనం లేకుండా పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి ఇక్కడ పరిస్థితిని విన్నవించామని, ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే ఆ మార్గం వెంట నడుస్తున్న మట్టి టిప్పర్లను నిలిపివేసేలా గ్రామస్తులంతా ఏకంగా ఉండాలని తాను సైతం సంబంధిత అధికారులతో మాట్లాడి మట్టి రవాణా విషయాన్ని పరిశీలించి నిలిపివేయాలని సూచిస్తానని తెలిపారన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు ఎవరు చేసిన ఉరుకునేది లేద ని ఎమ్మెల్యే కోరం కనకయ్య భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశం లో ఆర్ఎస్ బోస్, స్థానిక వార్డు సభ్యుడు నాగుల్ పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్.. యువకుడికి తీవ్ర గాయాలు



**పినపాక,జూలై 17(ప్రజాజ్యోతి )** వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తో యువకుడికి తీవ్ర గాయాలు అయిన ఘటన పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పూనెం వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్ కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఇంటి వద్ద వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. ముందుగా జానంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం మణుగూరులోని 100 పడకల ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వం



**ఇల్లందు, జులై 17 (ప్రజా జ్యోతి )** అరుకాలం కష్టించి పంట పండించిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వమని పిఏసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పిఏసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు అమ్మిన ధాన్యానికి సంబందించిన ప్రతి పైసా రైతుల ఖాతాల్లోనే నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు రావాల్సిన ప్రతి రూపాయి సకాలంలో అందేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతులకు చెల్లింపుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఈనెల 20 వరకు పూర్తి అవుతుందన్నారు. సుమారుగా 290 మంది రైతులకు చెందిన 3700 లకు పైగా బస్తాలు వర్షానికి తడిసిన విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగిందని పేర్కొన్నారు. ధాన్యం నష్టపోయిన రైతులకు అవసరమైతే పిఏసిఎస్ ద్వారా చెల్లిస్తామని స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసేందుకు గోడౌన్ నిర్మాణం కోసం అధికారులను కోరినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, తప్పుడు ప్రచారాలను ఎవరు నమ్మి ఆందోళన చెందవద్దని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బండారి శ్రీను, డైరెక్టర్లు కెన్నెర నర్సయ్య, రావూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- **ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భరత్**

**టేకులపల్లి,జూలై 17, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని నరసాయిగూడెం గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భరత్ రైతులకు ఎల్ నినో ప్రభావం, పంటల నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ భరత్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, దీంతో పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని కాలువలు, చెరువుల ఆయకట్టు ప్రాంతాల్లో వరికి బదులుగా కందులు, మినుములు, నువ్వులు, అలసందలు, ఆముదం, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.వరి సాగు చేసే రైతులు తక్కువ వ్యవధిలో కోతకు వచ్చే తెలంగాణ సోనా, కేఎన్ ఎం–7715, సిద్ధి వంటి రకాలను ఎంచుకోవాలని సూచించారు.



భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు కొనసాగితే 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు.ప్రత్తి పంటలో శనగ పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, నివారణ కోసం క్లోరోపైరిఫోస్ 500 మిల్లీలీటర్లు లేదా ఏసీఫేట్ 400 గ్రాములును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి గౌస్, అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# 7వ డివిజన్‌లో వృథాగా పోతున్న మిషన్ భగీరథ తాగునీరు

- **అర్హులైన ప్రతి ఇంటికి కనెక్షన్లు కల్పించాలని స్థానికుల వినతి.**



**పాల్వంచ, జూలై 17, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ పరిధిలోని 7వ డివిజన్‌లో మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్లు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక కుటుంబాలు ఇప్పటికీ మిషన్ భగీరథ తాగునీటి సౌకర్యానికి దూరంగా ఉండగా, పైప్‌లైన్ ద్వారా విడుదలవుతున్న శుద్ధి చేసిన తాగునీరు వినియోగదారులకు చేరకుండా మురుగు కాలువల్లోకి చేరి వృథాగా పోతున్నట్లు వారు పేర్కొన్నారు.ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తుండగా, 7వ డివిజన్‌లో తాగునీటి కనెక్షన్ల కల్పనలో నిర్లక్ష్యం కారణంగా విలువైన నీటి వనరులు వృథా అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు శుద్ధి చేసిన తాగునీరు కాలువల్లోకి చేరి వృథా కావడం విచారకరమని వారు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) తక్షణమే స్పందించి, 7వ డివిజన్‌లో అర్హులైన ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్లు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్థానికుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 42వ డివిజన్‌లో పైప్‌లైన్ లీకేజీతో వృథాగా తాగునీరు

- **అంగన్‌వాడీ సెంటర్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు**
- **వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**



**పాల్వంచ, జూలై 17, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వం చ పరిధిలోని 42వ డివిజన్‌లో అంగన్‌వాడీ సెంటర్ సమీపంలో మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడి, ప్రతిరోజూ విలువైన తాగునీరు భారీగా వృథా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.లీకేజీ కారణంగా తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ బురద పేరుకుపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో, కార్లతో పాటు ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారి, ఎప్పుడు ప్రమాదాలు జరుగుతాయోనన్న ఆందోళన నెలకొంది. అంతేకాకుండా, ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇ బ్బందులు పడుతుండగా, మరోవైపు శుద్ధి చేసిన తాగునీరు ఇలా వృథా కావ డం ప్రభుత్వ ఆస్తి, ప్రజల సొమ్ము నష్టపోవడానికి కారణమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, లీకేజీకి గల అసలు కారణాన్ని గుర్తించి అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టి, రహదారిపై ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# పాల్వంచ లో బ్రహ్మర్షి పత్రీజీ మూవీ పోస్టర్ ఆవిష్కరణ

- **జూలై 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న బ్రహ్మర్షి పత్రీజీ ది కంప్లీట్ మాన్**
- **చిత్రాన్ని విజయవంతం చేయాలని పిలుపు**




**పాల్వంచ, జూలై 17, ప్రజాజ్యోతి:** ధ్యాన జగత్ సృష్టికర్త బ్రహ్మర్షి పత్రీజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన 'బ్రహ్మర్షి పత్రీజీ – ది కంప్లీట్ మాన్' చిత్రం ఈ నెల 19వ తేదీ ఆదివారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న సందర్భంగా పాల్వంచ పట్టణంలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ జి. భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సేవాదళ్ అధ్యక్షులు వై. నాగేశ్వరరావు మాట్లాడుతూ, ధ్యాన ఉద్యమాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన బ్రహ్మర్షి పత్రీజీ విశిష్ట జీవితం, వారి ఆధ్యాత్మిక సందేశం, మానవతా విలువలను ప్రతిబింబించే ఈ చిత్రం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విధంగా రూపొందించబడిందన్నారు.కొత్తగూడెం పట్టణంలోని మహేశ్వరి థియేటర్‌లో జూలై 19న ఉదయం 7:45 గంటల నుంచి 10:45 గంటల వరకు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధ్యానం, ఆధ్యాత్మికత, మానవతా విలువల పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా వీక్షించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరెడ్డి, పాల్వంచ సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి. జయశ్రీ, పి.ఎస్.ఎస్.ఎమ్. ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ కు పాల్వంచ విద్యార్థుల ఎంపిక

- **హైదరాబాద్ లో జరిగే ప్రతిష్టాత్మక పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమైన పాల్వంచ విద్యార్థులు**




**పాల్వంచ, జూలై 17, ప్రజాజ్యోతి:** హైదరాబాద్ లోని కోట్ల భాస్కర్ ఇండోర్ స్టేడియంలో 2026 ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న 2వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ కు పాల్వంచకు చెందిన డీఏవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది.పాల్వంచలోని ఎక్స్ ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో గ్రాండ్ మాస్టర్ కోనే సూరిబాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు.ఎంపికైన విద్యార్థులు జి. హర్షిక, జి. నిహాస్రీ, ఎం. మనుశ్రీ, బి. రోజసా, ఆర్. దితిక.ఈ అంతర్జాతీయ కరాటే ఛాంపియ న్ షి ప్ కు ప్రముఖ సినీ నటుడు డా. సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ గా ఎం. కన్నన్ గౌడ్ వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ నైస్ షాజీ, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఎక్స్ ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ కోనే సూరిబాబు అభినందించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించి, పాల్వంచతో పాటు తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.విద్యార్థుల ఈ విజయం పాల్వంచ ప్రాంత యువతలో క్రీడల పట్ల మరింత ఆసక్తిని పెంపొందిస్తుందని, భవిష్యత్తులో మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సారెకల్లు–కారేగట్టు గ్రామాలకు మొబైల్ సిగ్నల్ ఎప్పుడు ?

- **చెట్లు, గుట్టలు ఎక్కి ఫోన్ మాట్లాడుతున్న గ్రామస్తులు**
- **వెంటనే మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**



**పాల్వంచ, జూలై 17, ప్రజాజ్యోతి:** దేశం డిజిటల్ విప్లవం దిశగా వేగంగా అడుగులు వేస్తూ 5జీ సేవలను విస్తరిస్తున్న తరుణంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని సారెకల్లు, కారేగట్టు గ్రామాల ప్రజలు ఇప్పటికీ కనీస మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులు చెట్లు, గుట్టలు ఎక్కి ఫోన్ మాట్లాడాల్సిన పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.గ్రామాల్లో మొబైల్ సిగ్నల్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, పోలీసు, అగ్నిమాపక శాఖలకు సమాచారం అందించడంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర వైద్య సేవలు ఆలస్యం కావడంతో పాటు విద్యార్థులు ఆన్‌లైన్ విద్యకు దూరమవుతున్నారు. రైతులు, కూలీలు, వ్యాపారులు తమ రోజువారీ పనుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే యూపీఐ చెల్లింపులు, బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవడం కూడా కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కూడా సకాలంలో మాట్లాడలేని పరిస్థితి నెలకొనడం గ్రామ ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.ఈ నేపథ్యంలో సారెకల్లు, కారేగట్టు గ్రామాల్లో వెంటనే టెలికాం సర్వే నిర్వహించి, జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, వీఐ తదితర టెలికాం సంస్థలు నెట్‌వర్క్ సేవలను మెరుగుపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు. శాశ్వత పరిష్కారంగా కొత్త మొబైల్ టవర్ లేదా సిగ్నల్ బూస్టర్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా సమాన కమ్యూనికేషన్ సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.జిల్లా కలెక్టర్, జిల్లా టెలికాం కమిటీ, టెలికమ్యూనికేషన్స్ శాఖ అధికారులు, సంబంధిత టెలికాం సంస్థల ప్రతినిధులు తక్షణమే స్పందించి ఈ సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం నూతన కార్యవర్గ కమిటీల పదవీ స్వీకారం

**కొత్తగూడెం టౌన్,జూలై 17 ( ప్రజాజ్యోతి )**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పట్టణ, మరియు వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం నూతన కార్యవర్గ కమిటీల పదవీ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఘనంగా విడుదల చేశారు.డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ఎస్సీ సెల్ విభాగాలు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను, ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఎస్సీ సెల్ నాయకులు కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ ఆహ్వాన పత్రికల విడుదల కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పెదబాబు, చుంచుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జేమ్స్ సునీల్, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ పరమేష్‌యాదవ్, పాల్వంచ మండల అధ్యక్షులు భువన సుందర్ రెడ్డి, సర్పంచ్ లైలా, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు నాగరాజు గద్దల, రమేష్, పూనెం శ్రీనివాస్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.